## క్లుప్తంగా

### సీజన్‌లో ఆరోగ్య జాగ్రత్తలు తీసుకోవాలి


తోటాడలో వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ విమలగిరి

**మునగపాక:** సీజన్‌లో రోగాలు వ్యాపించకుండా జాగ్రత్తలు తీసుకోవాలని మునగపాక పీహెచ్‌సీ వైద్యాధికారి నంది విమలగిరి కోరారు. మండలంలోని తోటాడ పంచాయతీలో శుక్రవారం వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. తాజా ఆహారం తీసుకోవాలన్నారు. వర్షాలు కురుస్తున్నందున అంటు వ్యాధులు సోకకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో చదరం భాస్కరరావు, వైద్య సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

### కాంట్రాక్టు స్టాఫ్‌నర్సుల ఆందోళన


కోటవురట్ల సీహెచ్‌సీ వద్ద ఆందోళన చేస్తున్న కాంట్రాక్ట్ స్టాఫ్ నర్సులు

**కోటవురట్ల:** స్థానిక సీహెచ్‌సీలో కాంట్రాక్ట్ స్టాఫ్ నర్సులు శుక్రవారం ఆందోళన చేశారు. ఈ సందర్భంగా స్టాఫ్ నర్స్ పవన దీపిక మాట్లాడుతూ వైద్య విధాన పరిషత్‌లో ఉన్న ఖాళీలను స్టాఫ్ నర్స్‌లతో భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా విధులు నిర్వహిస్తున్న 11,500 మంది కాంట్రాక్ట్ స్టాఫ్ నర్స్‌లను రెగ్యులర్ చేయాలన్నారు.

### వాడ్రాపల్లిలో దెబ్బతిన్న ఇళ్లు


వాడ్రాపల్లిలో దెబ్బతిన్న ఇంటిని పరిశీలిస్తున్న సర్పంచ్ నూకరాజు, గ్రామ పెద్దలు

**మునగపాక:** మండలంలోని వాడ్రాపల్లిలో ఇటీవల కురిసిన వర్షాల కారణంగా పలు ఇళ్లు దెబ్బతిన్నాయి. మళ్ల అప్పలనాయుడు, మద్దాల పరమేశ్వరరావు ఇళ్లు నానిపోయాయి. పరమేశ్వరరావుకు చెందిన గొర్రె చనిపోయింది. విషయం తెలుసుకున్న సర్పంచ్ కాండ్రేగుల నూకరాజు, గ్రామ నాయకులు మళ్ల వరహా నరసింగరావు, కొయిలాడ దశావతారం, నూకప్పారావు తదితరులు దెబ్బతిన్న ఇళ్లను పరిశీలించి, రెవెన్యూ అధికారులకు సమాచారం అందించారు.

### జనవాణిలో వినతుల స్వీకరణ

**నక్కపల్లి:** మండల కేంద్రం నక్కపల్లిలోని జనసేన పార్టీ కార్యాలయం వద్ద ప్రతి రోజు జనవాణి కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి బోడపాటి శివదత్ తెలిపారు. శుక్రవారం ఆయన పార్టీ కార్యాలయంలో విలేకర్లతో మాట్లాడుతూ ప్రజా సమస్యలు తెలుసుకునేందుకు అన్ని మండల కేంద్రాల్లో జనవాణి కార్యక్రమం నిర్వహించాలని నిర్ణయించామన్నారు. నక్కపల్లి పోలీస్ స్టేషన్ ఎదురుగా ఉన్న కార్యాలయంలో ప్రతి రోజు ఉదయం నుంచి సాయంత్రం వరకు కాగిత ఎంపీటీసీ ఆకేటి గోవిందరావు, కురందాసు అప్పలరాజు, పాముగణేష్ యలమంచిలి చంద్రరావు, పిక్కి స్వామి అందుబాటులో ఉండి వినతులు స్వీకరిస్తారని చెప్పారు.

### రాంబిల్లిలో భారీ వర్షం

**రాంబిల్లి(యలమంచిలి):** రాంబిల్లి మండలంలో శుక్రవారం మధ్యాహ్నం నుంచి సాయంత్రం వరకు భారీ వర్షం కురిసింది. పలు గ్రామాల్లో రోడ్లు బురదమయమయ్యాయి. శారదా, మైనర్ శారదా నదుల్లోకి నీరు అధికంగా చేరింది. వరి పొలాల్లోకి నీరు అధికంగా చేరడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. తెగుళ్ల బెడద ఎక్కువగా ఉంటుందని చెబుతున్నారు. పల్లపు ప్రాంతాల్లో వరి నీట మునిగింది. కొన్ని గ్రామాల్లో కాలువలు పొంగి ప్రవహిస్తున్నాయి. వర్షానికి జన జీవనం స్తంభించిపోయింది. ప్రజలు ఇళ్లకే పరిమితమయ్యారు.



# తొలి పూజకు వేళాయె!

- మార్కెట్‌కు చవితి శోభ
- పూజా సామగ్రి విక్రయాలతో కిటకిట

**అచ్యుతాపురం(మునగపాక):** ఎటువంటి శుభ కార్యక్రమం తలపెట్టాలన్నా ముందుగా గణపతి పూజ చేయడం ఆనవాయితీ. విఘ్నాలను తొలగించే వినాయకుడిని పూజించేందుకు ప్రతి ఒక్కరూ ఉవ్విల్లూరుతుంటారు. అది కూడా వినాయక చవితి రోజున చేసే పూజ కోసం ఎదురుచూస్తుంటారు. శనివారం వినాయక చవితి వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు పాయకరావుపేట, యలమంచిలి నియోజకవర్గాలు ముస్తాబయ్యాయి. వాడవాడలా యువత చూడముచ్చటగా మండపాలు సిద్ధం చేశారు. పూజా సామగ్రి విక్రయాలు, కొనుగోళ్లతో మార్కెట్లు, బజార్లన్నీ కిటకిటలాడాయి. ప్రధాన రహదారుల్లో ఏర్పాటు చేసిన దుకాణాల వద్ద పూజా సామగ్రి, పత్రి, పువ్వులు, నేరేడు, మారేడు, జిల్లేడు, జామ, పనస, తులసి, యలమ, గరికి పత్రుల విక్రయాలు జోరుగా సాగాయి. చామంతులు, గులాబీలు, కలువ పూలు, తమలపాకులు, కొబ్బరికాయలు, అరటిపండ్లు, మావిడాకుల ధరలు ఆకాశాన్నంటాయి.

**జోరుగా వినాయక ప్రతిమల విక్రయాలు**

అచ్యుతాపురం మండలం హరిపాలెంలో వినాయక ప్రతిమల విక్రయాలు జోరుగా సాగాయి. 3 నుంచి 25 అడుగుల మేర విగ్రహాలను కళాకారులు అందుబాటులో ఉంచారు. సైజును బట్టి రూ.75 వేల వరకు ప్రతిమలను విక్రయించారు. భక్తులకు అవసరమైన ప్రతిమలను కొనుగోలు చేసి ట్రాక్టర్లు, ఆటోలు, బైక్‌లపై తీసుకెళ్లారు. గణపతి, ఆంజనేయ, కృష్ణావతారం, శివపూజ, మయూరి గణపతి, మహారాజ గణపతి, బాలాజీ గణపతి, అయ్యప్ప గణపతి, తదితర ప్రతిమలు ఆకట్టుకున్నాయి. మార్కెట్‌లో ప్రతిమల తయారీకి అవసరమయ్యే ముడి సరకుల ధరలు పెరగడంతో విగ్రహాల ధరలను పెంచక తప్పలేదని విగ్రహ తయారీదారులు శ్రీనివాసరావు, లక్ష్మణరావు తెలిపారు.


పాయకరావుపేటలో ఆకట్టుకుంటున్న గణపతి విగ్రహాలు

**వాడవాడలా వినాయక మండపాలు**

అచ్యుతాపురం, మునగపాక మండలాల వ్యాప్తంగా వినాయక మండపాల ఏర్పాటులో నిర్వాహకులు నిమగ్నమయ్యారు. మండపాల్లో ప్రతిమలను ప్రతిష్ఠించి పూజలు చేసేందుకు అవసరమైన ఏర్పాట్లు చేశారు. పర్యావరణానికి హాని కలిగించే ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాల కన్నా మట్టి వినాయక ప్రతిమలకు ప్రజలు ప్రాధాన్యత ఇవ్వడం విశేషం.


గణనాథుడి ప్రతిమకు తుది మెరుగులు దిద్దుతున్న కళాకారుడు

**మండపాలకు తరలివెళ్తున్న గణనాథుడు**

**పాయకరావుపేట:** వినాయక చవితి సందర్భంగా గణపతి ప్రతిమలు మండపాలకు తరలుతున్నాయి. పట్టణంలో పలుచోట్ల గణేష్ విగ్రహాలను అమ్మకాల కోసం వ్యాపారులు ఉంచారు. శనివారం చవితి సందర్భంగా గురు, శుక్రవారాల్లో ఆయా గ్రామాలు, ఆయా ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన మండపాల్లో ప్రతిష్ఠించేందుకు అధిక సంఖ్యలో భారీ ప్రతిమలను భక్తులు తరలించారు.


పాయకరావుపేటలో మండపానికి గణనాథుడిని తరలిస్తున్న భక్తులు


సీతారామరాజునగర్ బాల వినాయకుడి మండపం ఏర్పాట్లలో భక్తులు


విక్రయానికి సిద్ధంగా ఉన్న వినాయక ప్రతిమలు

**ఆలయాల ముస్తాబు**

**నక్కపల్లి:** నక్కపల్లి, దేవవరం, ఉద్దండపురం, గొడిచర్ల, చినదొడ్డిగల్లు, ఉపమాక, వేంపాడు, కాగిత, నెల్లిపూడి, డిఎల్‌పురం, సీహెచ్‌ఎల్‌పురం, జానకయ్యపేట, రమణయ్యపేట, గుల్లిపాడు, రేబాక, తదితర గ్రామాల్లో ఉన్న గణపతి ఆలయాలు చవితి ఉత్సవాలకు ముస్తాబయ్యాయి. విద్యుద్దీపాలంకరణ చేశారు. ప్రసిద్ధి పొందిన ఒడ్డిమెట్ట గణపతి నవరాత్రి ఉత్సవాలను దేవదాయ శాఖ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించనున్నారు. చవితినాడు ఇక్కడ తిరునాళ్లు జరగనున్నాయి.

**చవితి సంబరాలకు గణనాథుడు సిద్ధం**

**కోటవురట్ల:** చవితి సంబరాలకు గణనాథుడు సిద్ధమయ్యాడు. వాడవాడలా భక్తుల పూజలు అందుకునేందుకు ఎదురు చూస్తున్నాడు. వీధివీధినా గణపతి నవరాత్రి ఉత్సవాలకు మండపాలను సిద్ధం చేశారు. గణనాథుడిని భారీ ఊరేగింపుగా తీసుకొచ్చి మండపాలలో ప్రతిష్ఠించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. మండల కేంద్రంలోని సీతారామరాజునగర్‌లో శ్రీబాల వినాయక యూత్ ఆధ్వర్యంలో గత ఇరవయ్యేళ్లుగా గణపతి నవరాత్రులను వైభవంగా నిర్వహిస్తున్నారు. ఈ ఏడాది కూడా ఆకట్టుకునే రీతిలో మండపం నిర్మించి చవితి సంబరాలు జరిపేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్టు ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు.


దేవవరంలో గణపతి నవరాత్రలకు ముస్తాబైన ఆలయం

# మట్టి వినాయక ప్రతిమలను పూజించాలి


మట్టి ప్రతిమలు పంపిణీ చేస్తున్న వైఎస్సార్‌సీపీ జిల్లా కమిటీ కార్యదర్శి కొణతాల శ్రీనివాసరావు

**మునగపాక:** ప్రతి ఒక్కరూ మట్టి వినాయక ప్రతిమలను పూజించాలని జనసేన నాయకుడు సుందరపు సతీష్‌కుమార్ కోరారు. మునగపాక సంతబయిల శ్రీధర్మ ఫౌండేషన్ ఛైర్మన్ కర్రి సాయికృష్ణ సమకూర్చిన 2 వేల మట్టి వినాయక ప్రతిమలను ఆయన పంపిణీ చేశారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పర్యావరణానికి హాని కలిగించే ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాల జోలికి పోకుండా మట్టితో తయారు చేసే విగ్రహాలను వినియోగించాలన్నారు. ఈ కార్యక్రమంలో దాడి ముసిలినాయుడు, దాడి శివ, అప్పలనాయుడు, ఆడారి గోవింద, బీలా లక్ష్మణరావు, విల్లూరి నరసింగరావు, తదితరులు పాల్గొన్నారు.


పాములవాకలో ప్రతిమలు అందిస్తున్న ఎస్ఎస్‌పి కరస్పాండెంట్ సాయికుమార్, విద్యార్థులు

**400 మట్టి గణపతి ప్రతిమల పంపిణీ**

**ఎస్.రాయవరం:** మట్టి గణపతిని పూజించి పర్యావరణాన్ని పరిరక్షించాలని వైఎస్సార్‌సీపీ జిల్లా కమిటీ కార్యదర్శి కొణతాల శ్రీనివాసరావు కోరారు. ఎస్.రాయవరంలో సుమారు 400 మట్టి గణపతి ప్రతిమలను ఆయన మండలంలో భక్తులకు పంపిణీ చేశారు. ప్రతి ఏటా ఇలా మట్టి ప్రతిమలు పంపిణీ చేస్తున్నట్టు ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఎంపీటీసీ సభ్యుడు బైపా శ్రీనివాసరావు, మాజీ సర్పంచ్ లక్కోజు ఆదిమూర్తి, స్థానిక నాయకులు కుర్రా కాశి, కర్రి పెద్ద అబ్బాయి, తదితరులు పాల్గొన్నారు.

**కోటవురట్ల:** పర్యావరణ పరిరక్షణకు విద్యార్థులు మేము సైతం అంటూ ముందుకొస్తున్నారు. వినాయక చవితిని పురస్కరించుకుని పాములవాకలోని ఎస్ఎస్‌పి స్కూల్ అండ్ జూనియర్ కళాశాల విద్యార్థులు గణనాథుని మట్టి ప్రతిమలను తయారు చేసి శుక్రవారం పంపిణీ చేశారు. కరస్పాండెంట్ సాయికుమార్ చేతుల మీదుగా భక్తులకు ప్రతిమలను అందజేశారు. మట్టి వినాయకుడినే కొలుద్దాం.. కాలుష్యరహితంగా ఉందాం.. అంటూ విద్యార్థులు నినదించారు.


యలమంచిలిలో మట్టి విగ్రహాలను పంపిణీ చేస్తున్న సుందరపు సతీష్

**యలమంచిలి రూరల్:** నియోజకవర్గంలో 10 వేల మట్టి వినాయక విగ్రహాలను ఎమ్మెల్యే సుందరపు విజయ్‌కుమార్ పంపిణీ చేశారు. శుక్రవారం యలమంచిలి పట్టణంలో ఎమ్మెల్యే సోదరుడు సుందరపు సతీష్ స్థానికులకు మట్టి ప్రతిమలను అందజేశారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు బొద్దపు శ్రీను, కొటారు సాంబ, కొటారు నరేష్, తదితరులు పాల్గొన్నారు.

## అణుకులో పీఎం జన్ మాన్‌పై అవగాహన ర్యాలీ

**కోటవురట్ల:** దొంగ్రియా కోంద్స్ అభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వం పలు కార్యక్రమాలు నిర్వహిస్తోందని అసిస్టెంట్ ట్రైబల్ ఆఫీసర్ నాగశిరీష అన్నారు. గొట్టివాడ శివారు అణుకు గిరిజన గ్రామంలో పీఎం జన్ మాన్ కార్యక్రమంపై శుక్రవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం ప్రధానమంత్రి జన జాతి ఆదివాసీ న్యాయ మహా అభియాన్ పథకం గురించి వివరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ షెడ్యూల్డ్ తెగలలో బాగా వెనుకబడిన తెగ దొంగ్రియా కోంద్స్ అన్నారు. అణుకులో 44 దొంగ్రియా కోంద్స్ కుటుంబాలు ఉన్నట్టు తెలిపారు. వారికి ఈ పథకం ద్వారా పక్కా గృహాలు, మంచినీటి కుళాయిలు, మరుగుదొడ్లు, గ్యాస్ కనెక్షన్లు, విద్యుత్ కనెక్షన్లు, సీసీ రోడ్లు వంటి అన్ని సదుపాయాలు కల్పిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి ఉదయశ్రీ, ఎంపీడీవో కాశీవిశ్వనాథరావు, మండల స్థాయి అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.


అణుకులో ర్యాలీ చేస్తున్న అధికారులు

## రోటరాక్టు యంగ్ లీడర్స్, సబల కార్యవర్గ ప్రమాణ స్వీకారం

**పాయకరావుపేట:** రోటరాక్టు క్లబ్స్ అయిన యంగ్ లీడర్స్, సబల కార్యవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమం శుక్రవారం జరిగింది. స్పెసెస్ డిగ్రీ కళాశాలలో జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా డిస్ట్రిక్ట్ రోటరాక్టు కమిటీ ఛైర్మన్ రొటేరియన్ టి.రవి హాజరయ్యారు. యంగ్ లీడర్స్ అధ్యక్షుడిగా ఐ.చరణ్, సబల అధ్యక్షురాలిగా కె.స్వాతిక, కార్యదర్శులుగా జాఫర్, అనురాధ, కార్యవర్గ సభ్యులతో రోటరీ క్లబ్ తుని ప్రెసిడెంట్ రోటేరియన్ సిహెచ్. మంగరాజు ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా రవి మాట్లాడుతూ సేవా కార్యక్రమాలు చేయడానికి ముందంజలో ఉండే రోటరీ పరివారం ఈ ఏడాది పోలియో నివారణ, ఆరోగ్య సంరక్షణపై సేవలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో రోటరీ సంస్థకు చెందిన అసిస్టెంట్ గవర్నర్ పి.పద్మావతి, కార్యదర్శి ఎస్.వీర్రాజు, కోశాధికారి కె.కిషోర్‌రెడ్డి, క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.


రోటరాక్ట్, యంగ్ లీడర్స్ కార్యవర్గం

## పి.ధర్మవరంలో విద్యార్థులకు వైద్య పరీక్షలు

**ఎస్.రాయవరం:** పి.ధర్మవరం ఉన్నత పాఠశాలలో శుక్రవారం వైద్య శిబిరం నిర్వహించారు. విద్యార్థులకు పెనుగొల్లు పీహెచ్‌సీ వైద్యులు పరీక్షలు చేసి, అవసరమైన మందులు అందజేశారు. ఈ శిబిరంలో పీహెచ్‌సీ ఏఎన్ఎం దాలియమ్మ, ప్రధానోపాధ్యాయుడు బి.శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు అప్పలనాయుడు, గారా ప్రకాష్, సూరిబాబు, తదితరులు పాల్గొన్నారు.


విద్యార్థులకు పరీక్షలు చేస్తున్న వైద్యులు

## మాలల ఐక్యత సమావేశం రేపు

**మునగపాక :** ఎస్సీ రిజర్వేషన్ ఉప వర్గీకరణకు సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పుకు నిరసనగా ఆదివారం అనకాపల్లిలో జిల్లా మాలల ఐక్యతా సమావేశం జరగనుందని మునగపాక సర్పంచ్ దిమ్మల అప్పారావు, దళిత నాయకుడు కోనపల్లి రామ్మోహనరావు తెలిపారు. శుక్రవారం స్థానికంగా జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును పునః పరిశీలించాలని కోరారు. ఈ తీర్పుతో షెడ్యూల్ కులాల్లో కొన్ని కులాలకు నష్టం జరుగుతుందన్నారు. ఉమ్మడి రిజర్వేషన్‌ను అలాగే కొనసాగించాలన్నారు. ఈ నేపథ్యంలో అనకాపల్లి గాంధీనగర్‌లోని రామాలయం వీధిలో కేజేఏ ఫంక్షన్ హాలులో జరిగే సమావేశాన్ని విజయవంతం చేయాలన్నారు. ఈ సమావేశంలో దళిత నాయకులు రాజాన బుజ్జిబాబు, గుంట్ల అప్పారావు, పిట్టా అప్పారావు, లంబా అప్పారావు, బీలా శివగణేష్, బీలా లక్ష్మణరావు, పిల్లి అప్పారావు, తట్టా అశోక్‌కుమార్, మురళి పాల్గొన్నారు.

# పశు బీమా పథకంతో భరోసా

**మునగపాక:** పశువులకు బీమా చేయించుకోవాలని మునగపాక మండల పశువైద్యాధికారి లావేటి ప్రదీప్‌కుమార్ కోరారు. మండలంలోని వాడ్రాపల్లిలో శుక్రవారం పశు సంవర్ధక శాఖ, రిలయన్స్ ఫౌండేషన్ సంయుక్త నిర్వహణలో పశు బీమా పథకంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీమా చేయించుకోవడం ద్వారా పశువు మృతి చెందితే సాయం అందుతుందన్నారు. రైతు వాటాగా 20 శాతం చెల్లిస్తే ప్రభుత్వం 80 శాతం చెల్లిస్తుందన్నారు. రిలయన్స్ ఫౌండేషన్ ప్రతినిధులు తిరుమలరావు, రామచంద్రరావు, రైతులు మళ్ల వరహా నరసింగరావు, జోగినాయుడు, తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న మండల పశువైద్యాధికారి ప్రదీప్‌కుమార్

## సీజనల్ వ్యాధులపై జాగ్రత్తలు తప్పనిసరి

**కోటవురట్ల:** కె.వెంకటాపురంలో శుక్రవారం పారిశుధ్య డ్రైవ్ నిర్వహించారు. కొద్ది రోజులుగా వర్షాలు విస్తారంగా కురుస్తుండడంతో వ్యాధులు చుట్టుముడుతున్నాయి. సీజనల్ జ్వరాలతో పాటు మలేరియా, డెంగ్యూ బాధితులతో ఆస్పత్రులు కిటకిటలాడుతున్నాయి. ఈ నేపథ్యంలో సర్పంచ్ పైల శ్రీదేవి, మంగా ఇందిర భవానీ ముందస్తు చర్యలు చేపట్టారు. పారిశుధ్య కార్మికులతో వీధుల్లోని చెత్తను తొలగించడంతో పాటు కాలువలలో బ్లీచింగ్ చల్లించారు. ప్రతి ఒక్కరూ పారిశుధ్యం మెరుగుకు సహకరించాలని సర్పంచ్ కోరారు. వ్యాధులు ప్రబలకుండా ప్రతి శుక్రవారం డ్రైడే పాటించాలని సూచించారు.


కె.వెంకటాపురంలో బ్లీచింగ్ చల్లుతున్న పారిశుధ్య కార్మికుడు

## మూలపేట రైతు సంఘం అధ్యక్షుడిగా నాని

**మునగపాక:** మూలపేట రైతు సంఘం అధ్యక్షుడిగా కె.నాని ఎన్నికయ్యారు. రామాలయంలో శుక్రవారం రాత్రి నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. కార్యదర్శిగా చిన అప్పలనాయుడు, కోశాధికారిగా ఎస్.శ్రీనివాసరావు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో రైతులు భీశెట్టి నాగేశ్వరరావు, కాండ్రేగుల శ్రీనివాసరావు, యల్లపు నాగేశ్వరరావు, గాంధీ, తదితరులు పాల్గొన్నారు.


మూలపేట రైతు సంఘ కార్యవర్గ సభ్యులు

# నక్కపల్లిలో జంగిల్ క్లియరెన్స్

**నక్కపల్లి:** మండల కేంద్రం నక్కపల్లి పోలీస్ స్టేషన్ పరిసర ప్రాంతాల్లో జంగిల్ క్లియరెన్స్ చేపట్టారు. శుక్రవారం సీఐ కుమారస్వామి స్టేషన్‌లోను, పరిసర ప్రాంతాల్లో విద్యుత్ తీగలు, భవనాలపై చెట్ల కొమ్మలు, పిచ్చి మొక్కలను తొలగించే కార్యక్రమాన్ని దగ్గరుండి చేయించారు. చెట్ల కొమ్మలు పెరిగి తీగలకు తాకడంతో తరచూ విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతోంది. దీంతో విద్యుత్ లైన్ల ఉన్న అన్ని ప్రాంతాల్లో చెట్ల కొమ్మలు తొలగించే ప్రక్రియ నిర్వహించారు.


విద్యుత్ తీగలపై ఉన్న చెట్ల కొమ్మలు తొలగిస్తున్న సిబ్బంది

## ఆన్‌లైన్‌లో బీజేపీ సభ్యత్వ నమోదు

**మునగపాక:** కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు పాలమరశెట్టి నాగేశ్వరరావు కోరారు. మండలంలోని తోటాడలో బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. సభ్యత్వ నమోదు కేవలం ఆన్‌లైన్ ద్వారా చేపడుతున్నామన్నారు. పార్టీ నాయకులు ఉడా రమేష్, చదరం సూరప్పారావు, పాలమరశెట్టి నాగభూషణం, కర్రి శ్రీను, తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## దొంకాడకు రోడ్డు ఏర్పాటు చేయాలని ఆందోళన

**గొలుగొండ:** కొత్త ఎల్లవరం నుంచి దొంకాడ గిరిజన గ్రామానికి రోడ్డు సౌకర్యం లేక ఇబ్బందులు పడుతున్నామని, వెంటనే అధికారులు, కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరుతూ సీపీఎం ఆధ్వర్యంలో శుక్రవారం గిరిజనులు ఆందోళన చేపట్టారు. గ్రామానికి రోడ్డు సౌకర్యం లేక నాలుగు కిలోమీటర్లు దూరం అడవి మార్గంలో నుంచి వచ్చి ప్రధాన రోడ్డుకు చేరుకుంటున్నామని వాపోయారు. ఇక్కడ విద్యార్థులు చదువుకు దూరమవుతున్నారని, వెంటనే రోడ్డు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. దశాబ్దాలుగా ప్రభుత్వాలు మారుతున్నా, తమ సమస్య పరిష్కారం కావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. సీపీఎం నాయకులు అప్పారావు, సత్తిబాబు, పాండురాజు, సుబ్బారావు పాల్గొన్నారు.


ఆందోళన చేస్తున్న గిరిజనులు, సీపీఎం నేతలు

## యాదవ విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు రేపు

**అనకాపల్లి:** జిల్లాలో ఈ ఏడాది పది, ఇంటర్మీడియెట్ పరీక్షల్లో ప్రతిభ కనబరిచిన యాదవ విద్యార్థులకు ఆదివారం ప్రతిభా పురస్కారాలు అందించనున్నట్టు జిల్లా యాదవ సంక్షేమ సంఘం అధ్యక్షుడు భరిణికాన సాయినాథరావు తెలిపారు. స్థానిక రామచంద్ర థియేటర్ సమీప యాదవ సంక్షేమ సంఘం కార్యాలయంలో శుక్రవారం విలేకరులతో ఆయన మాట్లాడారు. స్థానిక గవరపాలెం నూకాంబిక అమ్మవారి రహదారి లక్ష్మీగ్రాండ్ ఫంక్షన్ హాల్లో ఆదివారం ఉదయం 10 గంటలకు ఈ వేడుక జరుగుతుందన్నారు. కొత్తగా జిల్లా యాదవ సంఘం ఏర్పాటు చేశామన్నారు. మెరుగైన విద్య, వైద్యం అందించేందుకు దృష్టి సారిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా గౌరవాధ్యక్షుడు భరణికాన నరసింహమూర్తి, ప్రధాన కార్యదర్శులు సబ్బి శ్రీనివాస్, కరక సోమినాయుడు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న భరిణికాన సాయినాథరావు